# బొమ్మ-బొరుసు

చూస్తుండగానే కాలం ఇట్టే గడిచిపోతుంది. నిరాశా నిస్పృహలతో మొదలైన జీవితం ఇప్పుడు చీకు చింతలు లేనిదైంది. గీతకు మహదానందంగా ఉంది. ఫోను దగ్గర నుంచి లేచివచ్చి మళ్ళీ డ్రెస్సింగ్ టేబిల్ వద్ద కూర్చుంది. ఉదయమెప్పుడో అక్కడ పడేసిన పేపరులోని ఆ చిన్నవార్త తన చిన్ననాటి స్నేహితురాలిని కలిపింది.

మళ్ళీ పేపరులోని ఆ వార్తను చూసింది. డిప్యూటీ డైరెక్టరుగా శార్వాణికి పదోన్నతి నివ్వడం నియమవిరుద్ధమని, తాను ఆమెకంటే బాగా సీనియర్ కాబట్టి తనను నియమించవలసి వుండగా, అక్రమసంబంధాల కారణంగా శార్వాణిని ప్రమోట్ చేశారు.

ఈ పదవికి సీనియారిటీ కమ్ మెరిట్ ఆధారంగా కావాలిగాని మెరిట్‌కమ్ సీనియారిటీ ఆధారంగా కారాదంటూ ఒకతను అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో కేసు వేశాడు. ఆమెది సందేహాత్మకమైన చరిత్ర అన్నాడు. కేసు పూర్వాపరాలు ఆలోచించి ట్రిబ్యునల్ అతని పిటిషన్‌ను కొట్టివేసి, శార్వాణి పదోన్నతిని సమంజస మేనంటూ పేర్కొంది. పైగా ఆమెపట్ల అసభ్యకరమైన ఆరోపణలు చేసినందుకు పిటిషనర్ను ట్రిబ్యునల్ చీవాట్లు పెట్టింది.

ఆ వార్త మొదటిసారి చదవగానే ఈ శార్వాణి తన స్నేహితురాలా లేక వేరొకరా అని అనుకుంది. పదిహేను సంవత్సరాలుగా తాము ఇక్కడ ఉంటున్నారు. మరి శార్వాణి ఎందుకు తారసపడలేదు? సంసారబాధ్యతలలో తలమునకలై తాను శార్వాణిని ఇంతకాలం మరచిపోయిందా? గత డైరెక్టరీలో ఫోను నంబరు చూసి అనుమాన నివృత్తికి ఫోను చేసింది. "నేను మీ ఇంటికి మరోమారు వస్తాను. ఈరోజు మీ దంపతులు మా ఇంటికి రండి. నేను ఏడింటికి ఇంటికి వస్తాను. మీరు సరిగ్గా అదే టైమ్‌కి రండి. గీతా! నీతో చాలా విషయాలు మాట్లాడాలి" శార్వాణి ఫోనులో అని తన ఇంటి అడ్రసు గీతకిచ్చింది.

గీత సరేనంది.వెంటనే భర్తకు ఫోనుచేసింది.

"ఆరు గంటలకు రావడం కుదరదు. ఏడుకల్లా వచ్చేస్తాను" అన్నాడు మధుసూదనరావు.

తన భర్త ఒక డైరెక్టరు వద్ద సబార్డినేట్, భర్త సీనియర్ రీసెర్చి ఆఫీసరు. శార్వాణి జీతం తన భర్త జీతం కన్నా ఎక్కువా? ఎవరి హోదా గొప్పది?

ఒకప్పుడు తన భావాలెలాగుండేవి? స్త్రీలు పురుషులతో సమానంగా పనిచేస్తే సరిపోదు. వారు పురుషులను అధిగమించాలి. అప్పుడు స్త్రీజాతి బాగుపడుతుంది. మరి తన ఆలోచనలు ఈనాడు

విపరీతంగా వున్నాయే? శార్వాణి హోదా, జీతం తన భర్తను మించకూడదనే తలంపు తనకెలా వచ్చింది? ఇది ఈర్ష్యా?

★ ★ ★

తనతోపాటు ఒకటవ క్లాసు నుంచి బి.ఎస్.సి. వరకు చదివింది శార్వాణి. అన్నిటిలోనూ వారివి ఏకాభిప్రాయాలైనా భావిజీవితం గురించి ఆమె ఆలోచనలు వేరు విధంగా వుందని రిజల్ట్స్ వచ్చేవరకు గీతకు తెలియలేదు.

"ఇప్పటికి చదువు పూర్తి అయింది. ఇంక చేసేది ఏముంది? తల్లిదండ్రులు ఎవరిచేత పుస్తెకట్టించుకోమంటే వారిచేత పుస్తె కట్టించుకుని ఆదర్శగృహిణినౌతాను. ఆడపిల్లకు అంతకుమించి వేరే కోరికలు ఏముంటాయి?" అంది శార్వాణి తన భావి కార్యక్రమం గురించి అడిగితే.

"వాట్! నాన్‌సెన్స్! మరీ ఇంత పురాతనభావాలా? ఇంత చదువూ చదివి ముక్కూ మొహం తెలియనివాడికి జీతంబత్తెం లేకుండా ఊడిగం చేయాలని ఎలాగనుకుంటున్నావు? నీకు వ్యక్తిత్వంలేదా? ఇలా నీలా అందరూ తలపోస్తే మన సమాజం ఎప్పుడు బాగుపడుతుంది? ఆనాడు కన్యాశుల్కం రోజులలోనూ ఈనాడు వరకట్నాల కాలంలోనూ ఆడపిల్లలే బలి అవుతున్నారు. పురుషాధిక్య ప్రపంచానికి హద్దులు లేకుండా పోతున్నాయి.

పెళ్ళిమీదే అంత మోజు వుంటే బి.ఎస్.సి. వరకు ఎందుకు చదివావు? టెన్త్ కాగానే పెళ్ళి చేసుకుని ఉంటే ఈపాటికి మా నాయనమ్మలా ఆరుగురు పిల్లలకు తల్లి అయ్యేదానివి. నీ తల్లిదండ్రులే కాదు ప్రభుత్వం కూడా నీ చదువుకి బాగా ఖర్చుపెట్టింది. అంతా బూడిదలో పోసిన పన్నీరైంది."

"టెన్త్ పాసైననాటికి నా వయసు పదిహేను సంవత్సరాలు. అప్పట్లో చదవాలని వుండేది. నా చదువు నిరర్థకమైందని నేను కలలో కూడా అనుకోను. అయితే భావిజీవితంలో అవసరమనిపిస్తే తప్పక ఏదో జాబ్ చేస్తాను" అంది శార్వాణి.

"శార్వాణీ! నా మాట విను. ఉద్యోగ ప్రయత్నాలు చేయి. పెళ్ళికి తొందరెందుకు? ఉద్యోగం పురుషుల లక్షణమే కాదు. అది స్త్రీల అధికారం కూడాను. పితృస్వామిక సమాజం తాలూకు పురుషాధిపత్యాన్ని మన స్త్రీలు ఎందుకు సహించాలి? శయనేషు రంభ, కార్యేషు దాసి అబ్బా ఎంత గొప్పగా వంచించారు?"

"గీతా! నీ ఆవేదనను అర్థం చేసుకోగలను. చదువుకున్న స్త్రీలందరూ ఉద్యోగాలకు ఎగబడితే సమాజంలో మనకు సగభాగమైన పురుషులు నిరుద్యోగులుగా మిగులుతారు. స్త్రీ శక్తిని నేను తక్కువగా అంచనా వేయటంలేదు. వారు ఏ రంగంలోనైనా పురుషుల కంటే అధికంగా రాణించగలరు. అయితే దేనికైనా పరిమితులు ఉంటాయి.

నీకు తెలుసుగా నాలుగు సంవత్సరాలై మా అమ్మ మంచం పట్టింది. నా పెళ్ళి తన కళ్ళతో చూడాలనుకుంటున్నది. నేడో రేపో రాలిపోయే మా అమ్మ కోరిక నెరవేర్చడం కూతురిగా నా కర్తవ్యం కాదా? ఇకపోతే మనువు చెప్పినదాన్ని వక్రీకరించి మన స్త్రీలకు అన్యాయం చేశాడని నిందవేయకు. కులధర్మపత్నికుండవలసిన ఆరు లక్షణాలను చెప్పాడు. మిగతా నాలుగూ మన స్త్రీల హోదాలను పెంచేవి కావా?"

"నాకు తెలుసు. మీవాళ్ళు నీ కాళ్ళకు ఇలా బంధం వేస్తున్నారు. మీ అమ్మ ఆరోగ్యం బాగుపడాలంటే డబ్బు కావాలి. నీవు ఉద్యోగం చేస్తే అది మీ అమ్మకు మేలు కాదా? నీ సబలత్వాన్ని నిరూపించుకోవడం మాని వారి ఉచ్చులో పడ్డావు."

శార్వాణి మారదు. ఇలాంటివారే సంపూర్ణ స్త్రీజాతికి అన్యాయం చేస్తున్నారు అనుకుంది గీత.

కొంతకాలానికి గీత తండ్రికి వేరొకచోటికిబదిలీ ఐన కారణంగా స్నేహితులిద్దరూ విడిపోయారు.

★ ★ ★

"అమ్మా! మెరిట్ చూసి ఉద్యోగాలు ఇచ్చే రోజులు పోయాయి. రెండేళ్ళె ప్రయత్నాలు చేస్తున్నావు. ఇప్పటికీ నీకే ఉద్యోగం దొరకలేదు. ఇకముందు దొరుకుతుందన్న ఆశ నాకు లేదు. వయసు ముదిరితే పెళ్ళికావడం కష్టం. నా మాట విని పెళ్ళికి ఒప్పుకో" గీత తండ్రి అన్నాడు. తండ్రి అలా అనేసరికి గీత బాధపడింది.

ఇలా చదువు పూర్తికాగానే అలా ఉద్యోగం వస్తుందని అనుకుంది. ఫస్ట్‌క్లాసులో బి.ఎస్.సి. పాసైంది. ఎన్ని ఇంటర్వ్యూలకు వెళ్ళినా సెలక్ట్ కావడంలేదు.

పురుషాధిక్య సమాజం స్త్రీలపట్ల వివక్ష చూపుతోంది. తనకన్నా తక్కువ చదువుకున్నవారికి ఉద్యోగాలు వస్తున్నాయి. మరి లోపం ఎక్కడ ఉంది?

"గీతా! నీ భావాలను మేం అర్థంచేసుకోగలం. అయితే మొండి పట్టుదల మంచిది కాదు. పరిస్థితులతో రాజీపడటం నేర్చుకో. ఆర్థిక స్వాతంత్ర్యంకోసం స్త్రీలు ఉద్యోగాలు చేయాలంటావు. ఆ స్వాతంత్ర్యం నీవు ఒక ఉద్యోగినివి అయినంత మాత్రాన రాదు. నా కాళ్ళమీద నేను నిలబడగలను, నాకు వివాహమెందుకు అని భావిస్తే అది గతితప్పిన ఆలోచనే అవుతుంది.

నిజమే. ఇది పురుషాధిక్య ప్రపంచమే. దీనిలో మార్పులు సహజంగా రావలసినవే. మన కుటుంబ వ్యవస్థ అనాదికాలంగా వస్తున్నా విచ్ఛిన్నం కాలేదు. అంటే ఈ వ్యవస్థలో ఎంతో నిజాయితీ ఉంది. స్త్రీ పురుషులిద్దరూ సహజీవనం చేస్తున్నారు. ఒకటీ అరా చోట్ల స్త్రీలకు అన్యాయాలు జరుగుతున్నమాట యదార్థమే. అందువలన పూర్తి వ్యవస్థ పుచ్చిపోయింది అనడం దుస్సాహసమే. స్త్రీ పురుషులిద్దరూ నాణేనికి బొమ్మ బొరుసులాంటివారు. జీవన శకటానికి రెండు చక్రాలలాంటివారు. ఏ చక్రం లేకపోయినా బండి నడవదు. పాలపొంగు వయసులో వివాహ వ్యవస్థ మీద నీకు చిన్నచూపు ఉండవచ్చు.

ఒక వయసు వచ్చిన తర్వాత స్త్రీకైనా పురుషునికైనా తోడు కావాలి. పెళ్ళి చేసుకున్న తరువాత ఎందరో స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్నారు. పురుషులు కూడా తమ భార్యలను ఉద్యోగాలు చేయడానికి ప్రోత్సహిస్తున్నారు. ఆ వికల్పం నీకు ఉంది. తల్లిదండ్రులుగా మేం నీ మేలుకోరే చెప్తున్నాం" తల్లితండ్రికి వంతపాడింది.

గీత అభిప్రాయంలో సడలింపుకి తల్లిదండ్రులు ఆనందించారు.

"నేను మీరు చెప్పినట్లు పెళ్ళిచేసుకుందికి ఒక షరతుమీద సుముఖంగా వున్నాను. ఉద్యోగం చేస్తానంటే వారు అడ్డుపెట్టకూడదు. నా జీవితాశయం ఉద్యోగం, స్వార్జితం" అంది.

"చాలమ్మా! నీవు ఒక్క మెట్టుదిగావు" అంది తల్లి.

★ ★ ★

పెళ్ళిచూపులలో గీత తన అభిప్రాయాన్ని చెప్పి "పెళ్ళిచేసుకున్నా నేను ఉద్యోగం చేయాలనుకుంటున్నాను. మీరు అభ్యంతరం చెప్పమని మాట ఇవ్వాలి" అంది గీత.

"దానికేం, ఉద్యోగం చేసే భార్యామణి నాలుగురాళ్ళు తెస్తానంటే మావాడెందుకు అభ్యంతరం చెప్తాడు" నవ్వుతూ అన్నారు పెళ్ళికొడుకు తల్లిగారు.

"అంతేకాదు, నా సంపాదనను యథేచ్ఛగా ఖర్చుపెట్టుకునే అధికారం నాకుంటుంది. అలా ఎందుకు ఖర్చుచేశావు ఇలా ఎందుకు ఖర్చుచేశావు అని నన్ను నిలదీయరాదు."

"గీతా! ధైర్యంగా నీ మనసులోని మాట చెప్పావు. చాలా సంతోషం. అది నీ స్వార్జితం. కాబట్టి ప్రతీ రూపాయి ఆచితూచి ఖర్చుపెడతావని నాకు తెలుసు. నీ ఈ షరతూ మావాడికి సమ్మతమే. కాని పిల్లా నువ్వొకటి విస్మరిస్తున్నావు. ఇప్పుడంటే స్వపర భేదాలు పాటిస్తున్నావు. నువ్వు ఎవరితోనో వివాహబంధంలో పెనవేసుకుపోయిన తరువాత నీదీ నాదీ అనవు, మనది అంటావు. అది మన సంస్కృతి మనకు పెట్టిన భిక్ష. నీది లేతవయసు కాబట్టి ఇంకా ఎన్నో విషయాలు కాలక్రమేణా తెలుస్తాయి. మరో ముఖ్యమైన సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. నీకు ఉద్యోగం వేరేప్రదేశంలో దొరకవచ్చు లేదా కొంతకాలం తరువాత మీ భార్యాభర్తలలో ఎవరికైనా ఒకరికి ఇతరత్రా బదిలీ కావచ్చు. అప్పుడు భార్యాభర్తలు తాత్కాలికంగా వేరింటి కాపురాలు పెట్టవలసి రావచ్చు. అంతదూరం నువ్వు ఆలోచించి వుండవు. అయితే అప్పుడేం చెయ్యాలి అనేది నీ నిర్ణయానికే వదిలేస్తాము. ఇంకా ఏవైనా సందేహాలు వున్నాయా?"

గీత మధుసూదనరావుని పెళ్ళిచేసుకుంది.

★ ★ ★

పెళ్ళికిముందు గీత ఒక ఉద్యోగానికి అప్లై చేసింది. ఇంటర్వ్యూకు రమ్మంటూ వారు లెటరు రాశారు. గీత తండ్రి ఆ ఉత్తరాన్ని కుమార్తెకు పంపించాడు. ఇలాంటి ఉత్తరాలు లోగడ చాలా వచ్చాయి. ఇది మాత్రం వస్తుందన్న నమ్మకం లేదు. ఎటొచ్చీ ఇంటర్వ్యూ తల్లిదండ్రులు వుంటున్న పట్టణంలోనే.

ఇంటర్వ్యూకి వెళ్ళాలనుకుంది. అయితే తను సెలక్ట్ అయినట్లు తెలిసేవరకు ఆ విషయాన్ని భర్తకు చెప్పాలనుకోలేదు గీత. అందుకే ఓమారు మా అమ్మానాన్నలను చూసి వస్తాను అని మాత్రం చెప్పింది.

రెండునెలల తర్వాత ఆ ఆఫీసునుండి వచ్చిన ఉత్తరాన్ని తండ్రి గీతకు పంపిస్తూ "నీకు ఉద్యోగం వచ్చినందుకు సంతోషంగాఉంది. నిన్ను మన ఊరిలోనే వేశారు. నీ భర్తతో సంప్రదించి అతను అంగీకరిస్తే ఉద్యోగంలోచేరు. ఐతే ఈ ఎడబాటు మాకు విచారం కలిగిస్తుంది." అంటూ లేఖ రాశాడు.

గీత అపాయింట్‌మెంట్ ఆర్డరును చూసి మురిసిపోయింది. భర్తకు ఇష్టంలేకపోయినా చేరాలనుకుంది.

"ఏమంటీ! నాకు ఉద్యోగం వచ్చింది. మా వూరిలోనే. నన్ను చేరమంటారా? మూడువేలు జీతం" అంది సంతోషంగా.

మధుసూదనరావు సంతోషించనూలేదు, బాధపడనూలేదు.

"గీతా! పెళ్ళికిముందు మావద్ద వాగ్దానం తీసుకున్నావు. భార్యామణి ఉద్యోగం చేసి నాలుగు రాళ్ళు సంపాదిస్తుంటే మావాడు ఎందుకు అడ్డుచెప్తాడు అని మా అమ్మ ఆనాడే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది"

"మీ ముఖంలో సంతోషంలేదు. మీ పురుషప్రవృత్తిని పోనిచ్చుకున్నారుకాదు. నేను ఉద్యోగం చేయడం మీకు ఇష్టంలేదు. మీ అమ్మగారు మాట ఇచ్చారు. అది నిలుపుకోవాలనే అలా అంటున్నారు."

"అబ్బే. అదేంకాదు. ఇంతకాలం బ్రహ్మచారిగా బ్రతికాను. ఇప్పుడు నువ్వు నా హృదయసామ్రాజ్యంలో అడుగుపెట్టావు. ఇంత తొందరలో నువ్వు నన్ను విడిచివెళ్ళిపోతావంటే బాధగా ఉంది. అక్కడ నీకు నీ తల్లీదండ్రీ వుంటారు. నీకే కష్టం ఉండదు. నేను ఏకాకిగా మిగులుతాను."

"అదా మీ బాధ? ఆ వూరెంతదూరం. నాలుగైదు గంటల ప్రయాణం. సెలవురోజుల్లో వస్తూ ఉంటాను."

గీతకు ఉద్యోగంలో కొత్త అనుభవాలతోపాటు చేదు అనుభవాలూ ఎదురయ్యేవి. తన డ్యూటీ తాను చేసుకుపోవాలనుకునేది. కాని సహ ఉద్యోగులు చిన్నచూపు చూడడం వెకిలిచేష్టలు చేయడం భరింపశక్యం కాకుండా ఉన్నాయి. సినిమాకు ఆహ్వానించేవాడు ఒకడైతే, నేరుగా రూంకే రమ్మన్న అర్థంలో మాట్లాడేవాడు మరొకడు. ఉండబట్టలేక పై అధికారులకు ఫిర్యాదు చేసేది. వాళ్ళు సానుభూతి కనబరిచేవారే తప్ప, తప్పుడుకూతలు కూసేవారిని మందలించే ప్రయత్నాలు చేయలేదు.

"చూడమ్మా, నువ్వు కొత్తగా ఉద్యోగంలో చేరావు. అనుభవంమీద అన్నీ సర్దుకుంటాయి. ఎవరో నిన్ను కేంటీన్‌లో లేదా రోడ్డుమీదో ఏదో అన్నారంటే చర్య తీసుకోలేం. వాళ్ళమాటలను వినీ విననట్లు వదిలేయాలి" అంటూ సలహాలిచ్చేవారు.

తనెందుకీ ముళ్ళబాట ఎన్నుకుంది? తను అశక్తురాలా? తన స్త్రీశక్తి ఏమిటో క్షణాలమీద ఋజువుచేయగలదు. వారిలో ఒకరి చెంప ఛెళ్ళుమనిపిస్తుంది. అప్పుడు తానెవరో వారికి అర్థమౌతుంది.

మాటల సందర్భంలో తల్లితో ఆ మాటే అంది.

"అమ్మా! అంతపని చేయకు. ఒకరిద్దరు పోకిరీవాళ్ళు అంతటా ఉంటారు. సీతకే కష్టాలు తప్పలేదు. ఆడదానికి కొన్ని అగచాట్లు తప్పవు. సహనంతో వ్యవహరించు. లేనిపోని కష్టాలు కొనితెచ్చుకోకు" అని ఆమె హితవు చెప్పింది.

మధుసూదనరావుతో తన జీవితం, ప్రస్తుత పరిస్థితుల్లో తన జీవితం బేరీజు వేసుకుంది. భర్తను వదిలి ఏదో సాధిద్దామని వచ్చింది. ఏం సుఖపడుతున్నది? ఆమెకు రాత్రులు నిద్రరావడంలేదు. పనిలో మనస్కరించడంలేదు. ఆర్థిక స్వాతంత్ర్యం కావాలనుకుంది. తన భర్త జీతం మొత్తం తన చేతుల్లోనే పోసేవాడు. తనెలా ఖర్చుచేసినా ఆరాలు తీయలేదు. అత్తగారు ఎంత దూరదృష్టితో ఆనాడు అన్నారు.

'నీకు ఉద్యోగం వేరే ప్రదేశంలో దొరకవచ్చు లేదా కొంతకాలం తరువాత మీ భార్యాభర్తలలో ఎవరికైనా ఒకరికి ఇతరత్రా బదిలీ కావచ్చు. అప్పుడు భార్యాభర్తలు తాత్కాలికంగా వేరింటికాపురాలు పెట్టవలసి రావచ్చు.' ఎంత దూరదృష్టి. ఇప్పుడామెను ఏం చెయ్యాలి అని అడిగితే, ఎంత చిన్నతనం! తను చదువుకొంది. ఇలాంటి సమస్యలు ఆమె ముందు ఉంచితే ఆమె తనను హేళన చెయ్యరా? ఆనాడే ఆమె మరోమాట చెప్పారు. అప్పుడేం చేయాలో అది నీ నిర్ణయానికే వదిలేస్తున్నాను అని.

తల్లిదండ్రీ ఉద్యోగం వదులుకోకు. ఎన్నో ప్రయాసల తరువాత దొరికింది అంటారు. ఔను తను వారికి భారం కారాదని జీతం దొరకగానే సగం డబ్బు తల్లికిస్తున్నది. 'నాకెందుకమ్మా, నీ జీతం నువ్వే ఉంచుకో' అంటూనే 'నా కూతురి తొలిజీతం. మీ నాన్న ఎప్పుడూ మంచి చీర కొనలేదు. నీ పేరు చెప్పి కొనుక్కుంటాను' అంటూ తీసుకుంది. అడపా దడపా ఏదో ఖర్చులకంటూ తనదగ్గర వందా ఏభై తీసుకుని 'మీ నాన్నగారిని అడిగి ఇచ్చేస్తాను. ఆడపిల్ల సొమ్ము మాకెందుకు?' అనేది.

అంటే తన సంపాదన నాశించి వారు ఉద్యోగం చేయమని ప్రోత్సహిస్తున్నారా? మాటవరసకు నీ జీతం ఎలా ఖర్చుచేశావు అని భర్త అడిగితే తనేం సమాధానం చెప్పగలదు? గీత ఒక నిర్ణయానికి వచ్చి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చింది. షరతుల ప్రకారం ఒక నెల నోటీసుకు బదులుగా ఆ నెల జీతం కట్టేసింది.

తిరిగివచ్చిన భార్యను చూడగానే మధుసూదనరావు మనస్ఫూర్తిగానే బాధపడ్డాడు.

"గీతా! నువ్వు తప్పుచేశావు. ఈరోజుల్లో గవర్నమెంట్ ఉద్యోగాలు దొరకడం బహుదుర్లభం. ఉద్యోగి అన్నతరువాత ఓపికగా పనిచేయాలి. విధులు, బాధ్యతలు కర్తవ్యనిష్ఠతో నిర్వహించాలి. సత్ప్రవర్తనతో మెలగాలి. కారెక్టర్, సంయమనం అతి ముఖ్యం. అవే మనకు రక్షణ. సహనానికి పరీక్షపెట్టే సంఘటనలు రోజూ జరుగుతాయి.

ఉద్యోగం చేసే స్త్రీలపట్ల కొందరు పురుషులకు హీనభావన ఉంటుంది. ఆధునికత అనే పేరుతో కొందరు మహిళల వస్త్రధారణ మరీ వెగటుగా ఉంటుంది. ఉద్యోగినులు కాస్త స్మార్ట్‌గా ఉన్నా నలుగురితో కలివిడిగా ఉన్నా అది కొందరిని రెచ్చగొడుతుంది. ఆడది ఒంటరిది అని తెలుస్తే కొందరు దుర్బుద్ధితో ఆమెచుట్టూ చేరతారు.

స్త్రీలు చాలా జాగ్రత్తగా మసలుకోవాలి. యవ్వనంలో ఉన్న భార్యాభర్తలు షికారుకి వెళ్ళినా సినిమాకు వెళ్ళినా కొందరు వెనుకనుంచి జుగుప్సాకరంగా మాట్లాడుతారు, అసభ్యకరమైన సినిమాపాటలు పాడుతారు. అలాంటివారిని ఏం చెయ్యలేము. ఇక్కడ ఏనుగు - కుక్క కథను గుర్తు తెచ్చుకోవాలి.

ఎన్ని కుక్కలు ఎంతగా మొరిగినా ఏనుగు ఖాతరు చెయ్యదు. మనమే కనుక పరుషంగా జవాబిస్తే ఆ స్త్రీయే చులకన ఔతుంది. మరో ఆరేడు నెలలు ఓపికగా బేలన్స్‌గా పనిచేసి ఉంటే నీకు స్వానుభవమై ఉండేది. ఆ మొరిగే కుక్కలు అప్పటికి అలసిపోయి నీ జోలికి రావు' అన్నాడు మధుసూదనరావు.

పరుగెత్తి పాలు తాగడం కన్నా నిలబడి నీళ్ళు తాగడం మేలు. తను ఉద్యోగం చేయాలని ఎందుకు ఆరాటపడింది? స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యం కావాలి. వారు మగవాళ్ళకు కట్టుబానిసలు కారాదు. మహిళా విమోచనం గురించి తను ఎంతో సాహిత్యం చదివింది. రాజ్యాంగంలో స్త్రీలకు సమానహక్కులు ఇచ్చినప్పుడు స్త్రీలు వెనుకబడి ఎందుకు ఉండాలి? పురుషులను వారు ఎందులో తీసిపోతారు?

తన కొద్దిపాటి వైవాహిక జీవితాన్ని సింహావలోకనం చేసుకుంది. తను భర్తతో కాపురం చేస్తూ ఉంటే ఆర్థిక స్వాతంత్ర్యం లేదా? జీతం మొత్తం అతను తనచేతుల్లోనే పోస్తాడు. పోనీ తను ఉద్యోగం చేసింది. అది స్వల్ప సమయానికే కావచ్చు. తల్లిదండ్రులే మంచి మాటలాడుతూ దోపిడీ చేశారు. పెళ్ళికాకుండా ఉద్యోగంలో చేరివుంటే తాను నిలదొక్కుకుని ఉండేదేమో. వివాహజీవితంలోని

ఈ సుఖసంతోషాలను దూరం చేసుకోవడం అవివేకం. స్త్రీలు ఉద్యోగాలు చేయాలి - ఒకరి సంపాదన చాలనప్పుడు లేదా ఒంటరిగా బ్రతకవలసి వచ్చినప్పుడు.

ఆ తరువాత గీత ఉద్యోగం మాట మరచిపోయింది.

★ ★ ★

"గీతా! పాపను స్కూల్లో వేయాలి. రెండువేలు కావాలి" అన్నాడు మధుసూదనరావు.

అంతవరకు ఆమెకు అలాంటి స్పృహలేదు. భర్త చేతికిచ్చిన డబ్బును పూర్తిగా ఖర్చు చేస్తూ వస్తోంది. కొత్త సంసారం కావటాన ఏవో అవసరాలు వస్తూనే ఉండేవి.

"నా దగ్గర అంత డబ్బు లేదే!" అంది విచారంగా.

"ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ నీ చేతుల్లో ఉంది. పొదుపుచేస్తున్నావనుకున్నాను. సారీ! అడిగి నిన్ను ఇబ్బంది పెట్టాను" అన్నాడు మధుసూదనరావు.

మరుసటి నెల జీతం డబ్బులు గీతకిచ్చాడు మధుసూదనరావు. గీత ఆ డబ్బు తీసుకోలేదు. "పొదుపుగా వాడటం నాకు చేతకాదు. మీ దగ్గరే ఉంచండి. అన్నట్లు పిల్లపేరున ఇప్పటినుంచే రికరింగ్‌లో డబ్బువేయండి" అంది.

★ ★ ★

ఇప్పుడా పాప పదహారేళ్ళదైంది.

కాలం ఎంత తొందరగా దొర్లిపోయింది.

మధుసూదనరావు మాట ప్రకారం ఏడుకి ముందే ఇంటికి వచ్చాడు. పిల్లను ఇంట్లోనే వుంచి భార్యాభర్తలు శార్వాణి ఇంటికి వెళ్ళారు.

"రండి, రండి, మీరు గీతగారనుకుంటాను. మీరు వస్తున్నారని శ్రీమతి శార్వాణి డిప్యూటీ డైరెక్టరుగారు ఫోన్‌లో చెప్పారు."

గీత వాచీ చూసుకుంది. ఏడున్నర దాటింది. "శార్వాణి రాలేదా? ఏడింటికల్లా వస్తానందే?!" అంది.

ఏకవచనంతో గీత అనడం మధుసూదనరావుకి రుచించలేదు. ఎప్పుడో చిన్నతనంలో వారు కలిసిమెలసి వుండేవారు. కాని ఇరవైఏళ్ళ ఎడబాటు వారిమధ్య ఉంది. శార్వాణి మామూలు గృహిణికాదు. పెద్ద ఆఫీసరు.

"ఆమె పెద్ద ఆఫీసరుగారు కదండీ! అనుకున్న టైముకి రావడం కుదరొద్దూ? లోపలికి రండి. ఈలోగా మీకు కాఫీ తెప్పిస్తాను."

అతను హేళనగా అన్నాడా గౌరవంగా అన్నాడా? లుంగీ షర్టులో వున్న ఆ వ్యక్తి ఎవరు? నౌకరా? లేక శార్వాణికి సంబంధించిన బంధువా? అడగాలనుకున్నా సంస్కారం అడ్డువచ్చింది.

డ్రాయింగ్‌రూంలో సోఫాలో కూర్చున్నారు భార్యాభర్తలు.

అతను రెండు కప్పులు కాఫీ, వేరుగా పంచదార, బిస్కట్లు తెచ్చాడు. "పంచదార ఎంతకావాలో కలుపుకోండి" అంటూ పక్కనేవున్న కుర్చీలో కూర్చున్నాడు. మధుసూదనరావు తనకప్పు అందుకుని పంచదార కలుపుకొని తాగేశాడు. గీత తాగలేకపోయింది.

"మీరు శార్వాణిగారి చిన్ననాటి స్నేహితురాలట. ఆమె వస్తూనే ఉంటుంది. సంకోచించకండి. కాఫీ తాగండి" అన్నాడు.

ఎవరితను? శార్వాణిని ఒక పర్యాయం మన్ననపూర్వకంగా గారు అంటున్నాడు. అంతలోనే ఏకవచన ప్రయోగం. నౌకరైతే కుర్చీలోనైనా తమముందు ఎలా కూర్చోగలడు? భర్తా? శార్వాణి తన ఈడుదే. ఇతని వయసు మరీ ఎక్కువగా ఉంది. బహుశా ఆమెకు దూరపు చుట్టమై ఉంటాడు. బ్రతుకుతెరువుకోసం ఆమెపంచన చేరివుంటాడు.

గీత ఆలోచిస్తోంది.

"అదిగో వచ్చేశారు. మీ చిన్ననాటి స్నేహితురాలు" అంటూ కారు హారన్ వినగానే అతను వీధివైపు పరుగెత్తాడు. శార్వాణిచేతిలో బ్రీఫ్ అందుకోబోయాడు. ఆమె ఇవ్వలేదు. గీత అంతా గమనిస్తోంది.

"గీతా! కాస్త లేటైంది. మీరొచ్చి ఎంతసేపైంది?"

"అరగంట దాటింది. పాపం గీతగారు మహా ఇబ్బంది పడిపోయారు. చివరకు కాఫీ కూడా తీసుకోలేదు" అని శార్వాణితో అని "ఉండండి. వేడివేడి కాఫీ తెస్తాను. మీ స్నేహితురాళ్ళిద్దరూ తాగుదురుగాని" అన్నాడు.

"గీతా! ఇతను నా భర్త...."

"రంగనాథం నా పేరు" అన్నాడు ఆ వాక్యాన్ని పూర్తిచేస్తూ. గీత దిగ్భ్రాంతురాలైంది. శార్వాణి ఈ ముసలివాడిని ఎలా చేసుకుంది?

"శార్వాణీ! నాకు టైమ్ అయింది. నేను వస్తాను!" అంటూ అతను వెళ్ళిపోయారు.

"శార్వాణీ! అతను నీ భర్తా?! నీకంటే చాలా పెద్దవాడిలాగున్నారు?" అంది ఆశ్చర్యంగా.

మధుసూదనరావుకి పరిస్థితి అర్థమైంది. తన భార్య చిన్ననాటి స్నేహాన్ని పురస్కరించుకుని మంచీ చెడ్డల విచక్షణ లేకుండా నోటికి వచ్చిన ప్రశ్నలు వేస్తుంది. అందుకే చిన్న పని ఉంది అరగంటలో వస్తానంటూ లేచాడు.

"గీతా! నా జీవితం గురించి తెలిస్తే నీవీ ప్రశ్నలు వేసేదానివి కాదు. గతాన్ని తలచుకుంటే నాకు ఇప్పటికీ భీతావహంగా ఉంటుంది" అంది.

"నీ జీవితానికేం మూడుపువ్వులూ ఆరుకాయలు. నీది చాలా పెద్ద ఉద్యోగమని నాకు తెలుసు".

"ఉద్యోగ నిర్వహణలో నేనెన్నో పాఠాలు నేర్చుకున్నాను. మన శీలం మంచిదైనంత మాత్రాన సరిపోదు. నీతీనిజాయితీగా పనిచేసినా అడుగడుగునా కష్టాలు వస్తాయి. నాకు పెళ్ళిచేసి అత్తవారింటికి పంపాలని నా తల్లిదండ్రులు అనుకున్నారు.

హఠాత్తుగా మా నాన్నగారు కన్నుమూశారు. అన్నయ్య అప్పటికే పెళ్ళి చేసుకుని లక్నో వెళ్ళిపోయాడు. అమ్మ చావుబతుకుల్లో ఉంది.

అప్పుడు మా ఇంటికి నేనే ఆధారమయ్యాను. మా నాన్నగారు చనిపోయిన కారణంగా ప్రభుత్వం నాకు ఎల్.డి.సి.గా ఉద్యోగమిచ్చింది.

డిగ్రీ చదివిన నేను గజిటెడ్ లేదా ఎగ్జిక్యూటివ్ ర్యాంకుకి అర్హురాలినైనా ఆ ఉద్యోగంతో

సంతృప్తి పడాల్సివచ్చింది.

ఉద్యోగంలో చేరానన్న మాటేగాని అందులో నాకు సంతృప్తి లేదు. అప్పటికే జీవితం గురించి ఏవేవో కలలు కన్నాను.

నేను అసహాయురాలిని కావటాన ఎందరో నాతో చెలగాటాలాడడ్డానికి ప్రయత్నించేవారు. ఎవరితో చెప్పుకోలేని స్థితి. అయితే నా అసహాయత కారణంగానే ఆ పరిస్థితులను ఎదుర్కొంటూ, వాటిని నాకనుకూలంగా మలచుకుంటూ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాస్తూ ఒక్కొక్క మెట్టూ ఎక్కసాగాను. నేను ఆవిధంగా గజిటెడ్ ర్యాంకుకు వెళ్ళాను.

ఒక స్త్రీ కింద పనిచేయడమా అన్న హీనభావంతో ఓర్వలేక నామీద ఉన్నవీ లేనివి కల్పించి పెద్దాఫీసుకి ఆకాశరామన్న ఉత్తరాలు రాసేవారు కొందరు. అలాంటి ఉత్తరాలను బుట్టదాఖలు చేయాలి. కాని పై అధికారులు దర్యాప్తులు చేస్తూ శల్యపరీక్షలు చేసేవారు. అలా ఎన్నో దర్యాప్తులు జరిగాయి. అమ్మ కూడా మరణించింది.

నాకు ఆ ఉద్యోగమే ఆధారమైంది. విశ్వసనీయంగా సమర్ధవంతంగా పనిచేస్తున్న కారణాన నాకన్నా కొందరు సీనియర్లను త్రోసిరాజని నన్ను డిప్యూటీ డైరెక్టరు పదవికి పదోన్నతి చేశారు. పదోన్నతి చెల్లదంటూ దాన్ని రద్దుచేసి ఆమె స్థానంలో నన్ను ప్రమోట్ చేయమంటూ ఒక అధికారి ట్రిబ్యునల్‌లో కేసు వేశాడు"

"ఔను చదివాను. ఆ వార్త కారణంగానే నీ వునికి తెలిసింది" అంది గీత.

"కేసు వాదవివాదాలు జరుగుతున్నప్పుడు నా అంతట నేనే తప్పుకోవాలనుకున్నాను. ఏకాకిగా బతుకుతున్న నాకు ముందు వస్తున్న జీతం చాలు. అయితే నాకు జరుగుతున్న అన్యాయం సంపూర్ణ స్త్రీజాతికే అని నేను నా నిర్ణయాన్ని మార్చుకున్నాను. చివరకు న్యాయమే జయించింది".

"నేనడిగిన ప్రశ్నను దాటవేశావు. రంగనాథరావుగారిని నీవెప్పుడు పెళ్ళిచేసుకున్నావు? నీకెందరు సంతానం?"

"నాకు ఒక్క కూతురు. ఇరవై సంవత్సరాలుంటాయి. మా వివాహం జరిగి నిండా రెండేళ్ళు కాలేదు" అంది.

"ఆశ్చర్యపోకు. ఆ పిల్ల రంగనాథంగారి మొదటి భార్య వలన కలిగిన సంతానం" అంది శార్వాణి.

"మొత్తానికి నీవు మన సాంప్రదాయాన్ని కాపాడుతున్నావు. రెండో పెళ్ళివాడిని చేసుకోవడానికి నీకు మనసెలా వచ్చింది? స్త్రీ శక్తిని నిరూపించడంలో నీవు విజయం సాధించినా చెల్లుచీటీ రాయవలసిన సాంప్రదాయాన్ని పాటించి నీవు అపజయం పాలయ్యావు. శార్వాణి మనిషి మనుగడకు కూడు, గుడ్డా, నీడా కావాలి. వాటికి నీకు లోటు లేదు."

"గీతా! అంతేకాదు. జీవితం అన్న తరువాత తోడూ నీడా కావాలంటారు. పెళ్ళి చేసుకోని పురుషులైనా స్త్రీలైనా పరిపూర్ణులు కారు. అది భవబంధాలకు అతీతులైన సన్యాసులకో, సన్యాసినులకో చెల్లింది. ఇకపోతే రంగనాథరావుగారిని నీవు చులకనగా చూస్తున్నావు. అతని జీవితంలో ఒక్క పేజీ కూడా నీవు చూడలేదు."

"ఏ పురుషుని జీవితంలోనైనా ఏముంది గర్వకారణం? మన సమాజం భార్య చనిపోయిన పురుషులకు పునర్వివాహం చేసుకునే హక్కు ఇచ్చింది. ఎటూపోతే అలాంటి అధికారం స్త్రీలకు లేదు" అంది బాధగా.

"అదే నేను చెప్పబోతున్నాను. రంగనాధంగారి భార్య గతించి పదేళ్ళు అయింది. అతను రెండో పెళ్ళిమాట తలపెట్టలేదు. ఈమధ్యనే అతని అల్లుడు భార్యాసమేతంగా తిరుపతినుంచి తిరిగివస్తూ ఏక్సిడెంట్‌లో మరణించాడు.

రంగనాధంగారి కుమార్తెకు ఏడాది తిరగకుండానే వైధవ్యం ప్రాప్తించింది. సమాజం వ్యతిరేకిస్తున్నా అతను ఆ పిల్లకు పునర్వివాహం జరిపించారు. ఆ పెళ్ళిలోనే నేను రంగనాధరావుగారిని కలిసి మా పెళ్ళి ప్రస్తావన తెచ్చాను. ఈ వయసులో పెళ్ళా అని అతను అంగీకరించలేదు. నేను ప్రాధేయపడ్డాను. నాకు తోడు కావాలని"

"సారీ! శార్వాణీ! నీ జీవితంలో ఇంత విషాదం ఉందా?"

"ఇంకా కథ పూర్తికాలేదు. ఒక పెద్ద ఆఫీసరు భర్త ఒక గుమాస్తా అంటే లోకం హర్షించదని అతను స్వేచ్ఛా పదవీ విరమణ చేశారు. అయితేనేం భార్య సంపాదనతో బతకడం ఇష్టంలేక ఇంటర్, బి.ఎస్.సి. విద్యార్థులకు మేథ్స్ చెప్తారు. అందుకే ఎనిమిది గంటలకల్లా ఇక్కడినుంచి వెళ్ళిపోయారు. గీతా! నేను కూడా స్వేచ్ఛా సేవానివృత్తికి అప్లై చేశాను. నా అప్లికేషన్‌ను ఉపసంహరించుకోమని మా డైరెక్టరుగారు స్వయంగా కోరారు. నేను అందుకు అంగీకరించలేదు. నా చిరకాల వాంఛ నెరవేరింది. మా ఇద్దరికి వచ్చే పెన్షన్లు మా భుక్తికి చాలు. మరి ఇంకా సంపాదించాలన్న తపన నాకేల?" అంది శార్వాణి.

గీతకు తల్లిమాటలు గుర్తుకొచ్చాయి.

స్త్రీ పురుషులు ఒకే నాణేనికి బొమ్మ బొరుసులాంటివారు.

**(స్వాతి మాసపత్రిక - ఆగస్టు 2001)**